

కలెక్టర్ కీర్తి చేకూరిని కలిసిన ఎస్‌పి



ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

తూర్పుగోదావరి జిల్లా నూతన కలెక్టర్ కీర్తి చేకూరిని ఎస్‌పి డి.నరసింహకిషోర్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ సమర్థవంతమైన అమలు వంటి అంశాలపై ఇరువురు చర్చించుకున్నారు.

సచివాలయ ఉద్యోగులపై పనిభారం

- ఊరట నివ్వాలంటూ ఉన్నతాధికారులకు వేడుకోలు
- జిల్లాలో 5,500 మంది ఉద్యోగులు



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సచివాలయ ఉద్యోగులు(ఫైల్)

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

సచివాలయ ఉద్యోగులపై రోజురోజుకూ పని ఒత్తిడి పెరుగుతోంది. గత ప్రభుత్వ హయాంలో సచివాలయ వ్యవస్థ అందుబాటులోకి వచ్చిన విషయం విధితమే. క్షేత్రస్థాయిలో వాలంటీర్లు పనులు చక్కబెట్టగా పరిపాలనా విధులను సచివాలయ ఉద్యోగులు నిర్వహించేవారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాలంటీర్ల వ్యవస్థను తొలగించింది. మరోవైపు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు బాధ్యతను అప్పజెప్పడంతో ఉద్యోగులపై పనిభారం పడింది. తమపై ప్రభుత్వం మోపుతున్న పని భారం తగ్గించాలని, న్యాయమైన డిమాండ్లు నెరవే ర్చాలని వారు కోరుతున్నారు. ఉద్యోగ సంఘాల నేతలు జెపిసిగా ఏర్పడి అధికారులకు ఇప్పటికే వినతిపత్రాలు అందజేశారు.

జిల్లాలో ఒక మున్సిపల్ కార్పొరేషన్, 2 మున్సిపాలిటీలు, 515 గ్రామ, వార్డు సచివాలయాలు నడుస్తుండగా, వాటిలో సుమారు 5,500 మంది ఉద్యోగులు విధులను నిర్వర్తిస్తున్నారు. గత ప్రభుత్వం ప్రతి 50 ఇళ్లకు ఒక వాలంటీర్‌ను నియమించింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటింటికీ చేరవేయడం, పింఛన్ల పంపిణీ, ప్రభుత్వం నిర్దేశించిన సర్వేలు, కార్యక్రమాలను వాలంటీర్లు అమలు చేసేవారు. తాము అధికారంలోకి వస్తే వలంటీర్లకు రూ.10వేల జీతమిస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించింది. 2024లో అధికారంలోకి వచ్చాక వలంటీర్లకు జీతాలు పెంచకపోగా ఈ వ్యవస్థను తొలగించింది. కూటమి పాలనలో వాలంటీర్లు లేకపోవడంతో ఆ పనులన్నీ చేసే బాధ్యత సచివాలయ ఉద్యోగులపైన పడింది. దీంతో సహజంగానే సచివాలయ ఉద్యోగులపై అధిక భారం, పని ఒత్తిడి పెరిగింది. ప్రజలకు సంబంధించిన సామాజిక, ఆర్థిక, విద్య, వైద్యం, ఆధార్, బయోమెట్రిక్ వివ రాలు, ప్రభుత్వం సంక్షేమ పథకాలకు సంబంధించిన వివరాల సేకరణలతో భారం అధికమైంది. తమ సమస్యల పరిష్కారానికి జిల్లాలోని సచివా లయ ఉద్యోగ జెపిసి సంఘ ప్రతినిధులు కార్యాచ రణ ప్రణాళిక సిద్ధం చేశారు. ఇప్పటికే మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలకు వినతిపత్రాలు అంద జేశారు.

డిమాండ్లు ఇవీ...

ప్రతిసారీ సర్వేల పేరుతో ఇంటింటికీ తిరిగి విధులు నిర్వహించడం వల్ల క్షేత్రస్థాయిలో తీవ్ర అవమానాలకు గురవుతున్నామని ఈ విధుల నుంచి విముక్తి కల్పించాలని కోరుతున్నారు విద్యార్హతల ఆధారంగా రాష్ట్ర అభివృద్ధి, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా విధులు అప్పగించాలంటున్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులను మాతృశాఖలకు అప్పగించాలని కోరుతున్నారు. అదే విధంగా సమయపాలన లేని, ఒత్తిడితో కూడుకున్న విధుల నుంచి విముక్తి కల్పించాలని. సెలవులు, పండుగలు, ఆదివారాల్లో బలవంతపు విధులు చేయించడం ఆపాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఆరేళ్ల ఒకే కేడర్లో సర్వీసు పూర్తి చేసు కున్న ఉద్యోగులకు ఎఎఎస్ ప్రకారం స్పెషల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, ప్రొబేషనరీ సమయంలో రావాల్సిన నోషనల్ ఇంక్రిమెంట్లకు స్పష్టమైన ప్రైమ్ నిర్ణయించాలని కోరుతున్నారు. పట్టణ స్థానిక సంస్థల్లోని వార్డు సచివాల యాల్లోని ఖాళీలకు 50 శాతం సచివాలయ సిబ్బందితో భర్తీ చేయాలని, సర్వేలను ఆయాశాఖల సంబంధిత ఉద్యో గులతో నిర్వహించి, సచివాలయ సిబ్బందిపై భారం తగ్గించాలని వేడుకుంటున్నారు. ప్రస్తుతం అమలవుతున్న రికార్డు అసిస్టెంట్ క్యాడర్ను జూనియర్ అసిస్టెంట్ క్యాడర్‌కు మార్పు చేయాలంటున్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల స్టేషన్సీనియారిటీ ఆధారంగా పారదర్శక బదిలీలు జరిగేలా ప్రత్యేక విధి విధానాలను ఖరారు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.లేకుంటే రానున్న కాలంలో ఉద్యమిస్తామన వారు హెచ్చరిస్తున్నారు.



పెద్దేవంలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

వ్యాధి నిర్ధారణకు శ్యాంపిల్స్ సేకరణ

గేదెల మృత్యువాతపై కలెక్టర్ ఆరా

ప్రజాశక్తి- కొవ్వూరు, తాళ్లపూడి

వ్యాధుల బారిన పడిన పాడి గేదెలకు ప్రత్యేక నిపుణుల పర్యవేక్షణలో చికిత్స చేస్తున్నామని, నిపుణుల ద్వారా శ్యాంపిల్స్ సేకరించామని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. గురువారం తాళ్లపూడి మండలం పెద్దేవం, ఐ.పంగిడి గ్రామాల్లో కలెక్టర్ పర్యటించి రైతులతో మాట్లాడి సమస్య అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, గేదెలకు సంభవించిన వ్యాధి నివారణకు అన్ని చర్యలూ తీసుకుంటున్నామని తెలిపారు. రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. పశువుల పేడ పరీక్షల్లో బీకొలి, పొట్ట జలగ వ్యాధిగా నిర్ధారణ అయ్యిందన్నారు. గేదెలకు చికిత్స అందిస్తున్నామనారు. వ్యాధి లక్షణాలు తగ్గడం గుర్తించినట్లు పశు వైద్యులు చెబుతున్నారని కలెక్టర్ రైతులకు సూచించారు. మరిన్ని ల్యాబ్ పరీక్షల కోసం నమూనాలు సేకరించారన్నారు. రెండు, మూడు రోజులలో వాటి వివరాలు వస్తాయన్నారు. పశువైద్య జీవవిజ్ఞాన పరిశోధన సంస్థ (వి బి ఆర్ ఐ) ప్రత్యేక నిపుణుల బందం పర్యవేక్షణలో పశువులపై చికిత్స వ్యాధి తీవ్రత తదితర అంశాలపై కలెక్టర్ క్షేత్ర స్థాయిలో సమీక్షించారు. పెద్దేవంలో మృత్యువాత పడిన గేదెకు విజయవాడ నుండి వచ్చిన జాయింట్ డైరెక్టర్ డా.చంద్రమౌళి ఆధ్వర్యంలో శవ పరీక్షలు చేపట్టారన్నారు. తాళ్లపూడి మండలం పెద్దేవం గ్రామానికి చెందిన రైతు జె. సత్యనారాయణ, కొవ్వూరు మండలం ఐ.పంగిడికి చెందిన రైతు జె.కృష్ణార్జునలతో కలెక్టర్ ముఖాముఖి మాట్లాడారు. ఈ పర్యటనలో ఆర్‌డిఒ రాణి సుస్మిత, విజయవాడ విబిఆర్ఐ కేంద్రం జాయింట్ డైరెక్టర్ డాక్టర్ చంద్రమౌళి, సహాయ సంచాలకులు డాక్టర్ శిరీష, జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ టి.శ్రీనివాస్, డిడి సత్యనారాయణ, ఎడి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుంకర వెంకటరమణకు తోట పరామర్శ

ప్రజాశక్తి-గోకవరం

వైసిపి సీనియర్ నాయకులు సుంకర వెంకటరమణను మాజీ మంత్రి, వైసిపి జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట నరసింహం, వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోట రాంజీ గురువారం పరామర్శించారు. సుంకర వెంకటరమణ ఇటీవల గుండె సమస్యతో బాధపడుతూ రాజమహేంద్రవరంలోని బొల్లినేని ఆస్పత్రిలో శస్త్ర చికిత్స చేయించుకున్నారు. విషయం తెలుసుకున్న తోట నరసింహం, ఆయన తనయుడు తోట శ్రీరాంజీలు బొల్లినేని ఆస్పత్రిలో ఆయన్ని పరామర్శించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆయన కుమారుడు సుంకర వీరబాబుకి ధైర్యం చెప్పారు. ఆయన వెంట నాయకులు సమ్మెటి మోహన్, తోలేటి రాంప్రసాద్,వర ప్రసాద్ తదితరులున్నారు.



మండల వ్యాప్తంగా 'పోషణ్ మహా'

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలం లోని అంగన్‌వాడీ సెంటర్లలో గురువారం పోషణ్ మహా కార్యక్రమాన్ని నిర్వహించారు. వేలివెన్ను-2 సెంటర్‌లో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ బాల సరస్వతి, వేలివెన్ను పిహెచ్‌సి వైద్యులు సృజన, ఇర్ఫాన్ పాల్గొన్నారు. బాలమృతం కాంప్లిమెంట్ ఫీడింగ్‌లో పురుషులను కూడా చేర్చడం ద్వారా తండ్రి, బిడ్డకు అనుబంధం పెరుగుతుందన్నారు. ఊబకాయం, దాని వల్ల కలిగే నష్టాలు వారు వివరించారు. అక్టోబర్ 16 వరకు ప్రతి అంగన్‌వాడీ సెంటర్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో ఆర్ట్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఆర్ట్స్ కళాశాలకు చెందిన ఎన్‌సిసి కేడెట్లు జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. కేడెట్ కె.శిరీష ఆలిండియా థల్ సైనిక్ క్యాంప్-2025లో పాల్గొనిటెంట్ పిచింగ్‌లో స్వర్ణ పతకం గెలుచుకుంది. అఅలాగే అబ్స్టాకిల్ ట్రైనింగ్‌లోనూ ప్రతిభ చూపింది. మరో కేడెట్ సిహెచ్.వీరసూర్యదేవి జడ్జింగ్ డిస్టెన్స్, ఫీల్డ్ సిగ్నల్స్‌లో విశేష ప్రతిభ ప్రదర్శించింది. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్ర ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి అధికారులు లెఫ్టినెంట్ డాక్టర్ ఈసుబ్ బాషాషేక్, డాక్టర్ కె.అనూష పాల్గొన్నారు. ప్రతి ఏటా జాతీయ స్థాయికి విద్యార్థులు ఎంపికవ్వడంపట్ల ప్రిన్సిపల్ హర్షం వ్యక్తం చేశారు.



మాక్‌డ్రిల్‌లో పాల్గొన్న కమాండోలు

గోదావరి భవన్‌లో 'ఆపరేషన్ పుష్కర్'

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఒఎన్‌జిసి బేస్ కాంప్లెక్స్‌లోని గోదావరి భవన్‌లో గురువారం ఆపరేషన్ పుష్కర్ పేర మాక్ డ్రిల్ నిర్వహించారు. కార్యాలయాల ప్రాంతాల్లో ముప్పు జరిగే సందర్భాల్లో తీసుకోవాల్సిన చర్యలపై ఈ కార్యక్రమం సాగింది. ఒఎన్‌జిసి భద్రతా విభాగం, స్థానిక పోలీసు అధికారులు, ఎపిఎస్‌పిఎఫ్, ఎపి పోలీస్ ఆక్టోపస్ కమాండోల మధ్య సమన్వయాన్ని పెంచడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఒఎన్‌జిసి కార్యాలయంలోకి ఉగ్రవాదులు చొరబడి కీలక సిబ్బందిని బందీలుగా తీసుకున్న దృశ్యాన్ని ఈ మాక్‌డ్రిల్ అనుకరించింది. వైద్య విభాగం, మండల రెవెన్యూ విభాగం, అగ్నిమాపక విభాగం, ఎ.పి.ఎస్.పి.ఎఫ్ బొమ్మూరు పోలీస్ స్టేషన్, జిల్లా ఆర్మర్ రిజర్వ్ స్పెషల్ పార్టీ, బాంబు డిస్పోజల్ టీమ్ మరియు డాగ్ స్క్వాడ్ వంటి వివిధ సహాయక బందాలు మాక్ డ్రిల్‌లో పాల్గొన్నాయి. అదనంగా ఎస్‌పి చెంచి రెడ్డి, డిఎస్‌పిలు జగ్గు నాయుడు, జి.విశ్వనాథం, విజయవాడలోని ఆక్టోపస్ స్పెషల్ ఫోర్స్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్ ఆర్.రాంబాబు ఈ ఆపరేషన్‌ను పర్యవేక్షించారు. సెక్యూరిటీ లెఫ్టినెంట్ కల్నల్ కెఎస్.గుసేన్, సెక్యూరిటీ ఛీఫ్ మేనేజర్ పి శంకర్ నోడల్ అధికారులుగా వ్యవహరించారు.

సమస్యలపై విఆర్‌ఎల ధర్నా

ప్రజాశక్తి - యంత్రాంగం

సమస్యలను పరిష్కరించాలంటూ జిల్లాలో విఆర్‌ఎలు పలుచోట్ల ధర్నాలు నిర్వహించారు. ఎన్నికల హామీలు అమలు చేయాలని, అర్హులకు ప్రమోషన్లు ఇవ్వాలని, కనీస వేతనం రూ.26అమలు చేయాలని ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు.

గోకవరంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద మండలంలోని విఆర్‌ఎలు సోమవారం సమ్మె నిర్వహించారు. అర్హులకు ప్రమోషన్లు ఇవ్వాలని, కనీస వేతనం రూ.26వేలు అందించాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని, రెవెన్యూ శాఖలో ఖాళీ పోస్టులను అర్హులైన విఆర్‌ఎలతో భర్తీ చేయాలని నినదించారు. తమ సమస్యలను పరిష్కరించాలని లేకుండా రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి దిగుతామని హెచ్చరించారు.



గోకవరంలో నిరసన తెలుపుతున్న విఆర్‌ఎలు



ఉండ్రాజవరంలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న విఆర్‌ఎలు

సీతానగరం : తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని కోరుతూ గురువారం తహశీల్దార్ కార్యాలయం వద్ద విఆర్‌ఎలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు విఆర్‌ఎలు మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించి, ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని కోరారు. రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం డివిజన్ నాయకుడు కన్నెం రాజేంద్రప్రసాద్, సెక్రటరీ మద్దాల దుర్గారావు, తవిటికి వెంకటేష్, సిద్దే మధుసూదన్ రావు, కృష్ణవేణి, వెంకటలక్ష్మి, జ్యోతి, సూరిబాబు, బాదంపూడి ముసలయ్య, అబ్బులు, వీర్రాజు, నాని విఆర్‌ఎలు పాల్గొన్నారు.



సీతానగరంలో ప్లకార్డులతో ధర్నా చేస్తున్న విఆర్‌ఎలు

ఉండ్రాజవరం : సమస్యల పరిష్కారం కోసం గురువారం విఆర్‌ఎలు తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. నామినీలను విఆర్‌ఎలుగా నియమించాలని, అర్హులకు ప్రమోషన్‌లు, కారుణ్య నియామకాలు వంటి సమస్యలను పరిష్కరించాలన్నారు. అనంతరం తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. సమర్పించినట్లు ఉండ్రాజవరం మండల వీఆర్‌ఏ లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వీఆర్‌ఏ లు తిప్పర్తి నాగ ఆంజనేయులు, తణుకు శంకర్రావు, కొల్లు వెంకటరావు, కాకరపర్తి సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరులో ధర్నా నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

వేతన ఒప్పందం అమలు కోసం

మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి- కొవ్వూరు

సమ్మె కాలపు వేతన ఒప్పందాలు అమలు చేయాలని కోరుతూ కొవ్వూరులో మున్సిపల్ కార్మికులు గురువారం ధర్నా నిర్వహించారు.. రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల సందర్భంగా 12వ పిఆర్‌సి ప్రకటించాలన్నారు. జీతాలు పెంపుదల, సమ్మె కాలంలో చేసుకున్న ఒప్పందాలకు జిఒలు విడుదల చేయాలన్నారు. అలాగే సమ్మె కాలపు వేతనాలు విడుదల చేయాలని నినదించారు. సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఎం,సుందర్‌బాబు మున్సిపల్ కార్మికుల ధర్నాకు సంఘీభావం తెలిపారు. ధర్నా అనంతరం మధ్యాహ్నం రెండు గంటలకు మున్సిపల్ కార్యాలయం నుంచి అల్లూరి సీతారామరాజు విగ్రహం వరకు కార్మికులు ర్యాలీ నిర్వహించారు.

1800వ రోజుకు స్వర్ణాంధ్ర ఉచిత నిత్యాన్నదాన సేవలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

స్వర్ణాంధ్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత నిత్యాన్నదాన సేవలు గురువారం నాటికి 1800వ రోజుకు చేరాయి.. స్థానిక పుష్కర్ ఘాట్ వద్ద జరిగిన అన్నదాన కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్‌పి ఎన్‌బిఎం.మురళీకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై స్వయంగా భోజనాలు వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అన్నార్తుల వద్దకే అన్నదానం కార్యక్రమం హర్షణీయమన్నారు. నగరంలోని అన్నార్తులు, నిరాశ్రయులతో పాటు రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి వచ్చే రోగులు వారి బంధువులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఉద్యోగాన్ని తన జీవితాన్ని సమాజ సేవకు అంకితం చేసిన స్వర్ణాంధ్ర రాంబాబుకు నగరవాసులందరూ మరింతగా ప్రోత్సాహం అందించాలని కోరారు. తొలుత మురళీకష్ణను దుస్సాలువతో సత్కరించి స్వర్ణాంధ్ర జ్ఞాపికను రాంబాబు బహుకరించారు. అనంతరం రాంబాబు మాట్లాడారు. స్వర్ణాంధ్ర ఉచిత నిత్యాన్నదాన పథకానికి సహకరిస్తున్న నగర ప్రజలకు, అధికార, అనధికార ప్రముఖులకు, రాజకీయ నాయకులకు ముఖ్యంగా స్వర్ణాంధ్ర సభ్యులకు స్వచ్ఛంద సేవకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. 1800 రోజుల్లో సుమారు 9 లక్షల మందికి భోజనాలు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో గంగరాజు పాల డెయిరీ నిర్వాహకులు, టిడిపి నాయకులు నిమ్మలపూడి గోవిందు, స్వర్ణాంధ్ర వ్యవస్థాపకులు రావులపాలెం రామిరెడ్డి జమాలజిస్ట్ నాగభూషణం, హెల్పింగ్ హాండ్స్ వాట్సాప్ గ్రూప్ అడ్మిన్ అనుప్ జైన్, యూసఫ్ అమీర్, దువ్వాడ రాజా దివ్య తదితరులు పాల్గొన్నారు.



భోజనం వడ్డిస్తున్న అడిషనల్ ఎస్‌పి మురళీకృష్ణ

జర్నలిస్టు సురేష్‌కు అభిరామ్ పరామర్శ


ప్రజాశక్తి - సీతానగరం

ఇటీవల అనారోగ్యానికి గురై శస్త్రచికిత్స చేయించుకున్న ప్రజాశక్తి విలేకరి చెరుకూరి సురేష్‌ను రాజానగరం నియోజకవర్గ టిడిపి యువనాయకుడు పెందుర్తి అభిరామ్ గురువారం పరామర్శించారు. సీతానగరంలోని సురేష్ నివాసానికి ఆయన చేరుకుని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం సీతానగరంలో పలువురిని ఆయన పరామర్శించడానికి వెళ్లారు. ఆయన వెంట టిడిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



సురేష్‌ను పరామర్శిస్తున్న అభిరామ్ తదితరులు

కార్టూ'నిజం'



తుప్పల్లో గురుకులం

- విష పురుగులు, సర్పాలలో భయాందోళన
- దోమలతో విద్యార్థుల ఇబ్బందులు

ప్రజాశక్తి - గోపాలపురం

గోపాలపురంలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల చుట్టూ తుప్పలు విపరీతంగా పెరిగిపోయాయి. విషపు పురుగులు, సర్పాలకు నెలవుగా మారాయి. దీనికి తోడు సరైన డ్రెయినేజీ వ్యవస్థ కూడా లేకపోవడంతో మురుగునీరు నిలిచిపోయి దోమలకు ఆవాశంగా మారింది. ఈ పాఠశాలలో 5 తరగతి నుంచి ఇంటర్ తరగతులను నిర్వహిస్తున్నారు. సుమారు 640 మంది వరకూ బాలికలు విద్యనభ్యసిస్తున్నారు.

ప్రతి సంవత్సరం మంచి ఉత్తీర్ణత శాతం సాధించడంతో పాటు రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో ఈ విద్యార్థులు పతకాలను సాధిస్తుంటారు. దీంతో గోపాలపురం అంబేద్కర్ గురుకుల పాఠశాలకు మంచి గుర్తింపు ఉంది. పేద, సామాన్య, మధ్యతరగతి పిల్లలకు ఇది విద్యాప్రదాయినిగా ఉంది. జిల్లా నలుమూలల నుంచి పిల్లలను తల్లిదండ్రులు ఇక్కడే చదివించుకుంటున్నారు. పాఠశాలలో సీట్ల కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తారు. అలాంటి పాఠశాల నేడు తుప్పల్లో చిక్కుకుంది. పాఠశాల చుట్టూ ఉన్న దట్టమైన పొదలు, మురుగు నీటితో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పాఠశాల చుట్టూ ప్రహరీ ఉన్నప్పటికీ మురుగునీరు, తుప్పల వల్ల విద్యార్థులకు ఇబ్బందులు తప్పట్లేదు. ఇక్కడ పెరిగిన పొదల్లో పాముల సంచారం కూడా ఎకుకవగా ఉంది. పాఠశాల నుంచి వచ్చే మురుగునీరు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే మురుగునీరు పాఠశాల ప్రధాన గేటు వద్ద నిలిచిపోతుంది. దీంతో అక్కడ తీవ్ర దుర్గంధం వెదజల్లుతుంది. మురుగునీరు నిలిచిపోవడంతో దోమలకు ఆవాశాలుగా మారాయి. రాత్రి వేళల్లో దోమల వల్ల విద్యార్థులకు నిద్ర కరువవుతుంది. దోమల వల్ల విద్యార్థులు జ్వరాల బారిన పడే అవకాశమూ లేకపోలేదు. సంబంధిత అధికారులు స్పందించి ఇప్పటికైన పొదలన తొలగించాలని, డ్రెయినేజీ వ్యవస్థను బాగుచేయాలని పలువురు కోరతున్నారు.



నిలిచిపోయిన మురుగునీరు



పాఠశాలను కప్పేసిన పొదలు

పరిసరాలను శుభ్రం చేయాలి

నా ఇద్దరు పిల్లలు ఇదే పాఠశాలలో చదువుతున్నారు. పాఠశాలలో విద్యా బోధన బాగుంది. కాని పాఠశాల బయటవైపు చుట్టూ దట్టమైన మొక్కలు, పొదలు పెరిగిపోయాయి. మురుగునీరు అక్కడే నిల్వ ఉంటుంది. పాఠశాలలో ఉన్న పిల్లల్ని వద్దకు వెళ్లినప్పుడు దుర్వాసనకు గేటు బయట ఉండలేకపోతున్నాం. ఒకపక్క దుర్గంధం, మరోపక్క దోమలు ఎక్కువగా ఉన్నాయి. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని పాఠశాలల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి.

\- కొల్లి రమణ, విద్యార్థినుల తండ్రి

పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించాలి

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జిఒ నెంబర్ 128 ప్రకారం పౌర హక్కుల దినోత్సవం ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ ప్రతి మండలంలో ఒక గ్రామంలో ఒక పట్టణంలో ప్రతి నెలా 30వ తేదీ, ఫిబ్రవరి 28న జరిగేలా జిఒ అమలుకు చర్యలు తీసుకోవాలని తూర్పు గోదావరి జిల్లా కెవిపిఎస్ ప్రధాన కార్యదర్శి జువ్వల రాంబాబు, డివైఎఫ్ఐ నాయకులు వి.రాంబాబు కోరారు. అడిషనల్ ఎస్‌పి ఎవి సుబ్బరాజును గురువారం కలిసి వినతి పత్రాన్ని అందించారు. దీనికి ఎఎస్‌పి సానుకూలంగా స్పందించారు. వెంటనే అన్ని పోలీస్ స్టేషన్లకు సర్క్యులర్ ఇచ్చి అమలుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ జిల్లాలో అట్రాసిటీ నిరోధక చట్టం అమలుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని రాంబాబు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర జిల్లా డివిజనల్ స్థాయిలో విజిలెన్సు మానిటరింగ్ కమిటీలను వేసి ఘటనలపై పర్యవేక్షించాలని కోరారు

క్లాత్ సంచులపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

క్లాత్ సంచుల వాడకంపై వ్యాపారులకు అవగాహన కల్పించాలని అదనపు కమిషనర్ పివి.రామలింగేశ్వర్ మెప్మా సిబ్బందికి సూచించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని తన ఛాంబర్లో గురువారం మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్లు(సిఒలు), క్లాత్ బ్యాగుల తయారీదారులతో ఆయన సమావేశం నిర్వహించారు. జనపనార, గుడ్డ సంచులను వాడటం ద్వారా ప్లాస్టిక్‌ను పూర్తిగా దూరం చేయొచ్చన్నారు. నగరంలో కొన్ని మహిళా సంఘాలు జనుముతో ఆకట్టుకునే సంచులు తయారు చేస్తూ స్వయం ఉపాధి పొందుతున్నారన్నారు. ప్రణాళికబద్ధంగా అన్ని సమాఖ్యల ద్వారా నగరంలో క్లాత్ బ్యాగుల వాడకం పెరిగితే, మహిళలకు ఉపాధి దొరికే అవకాశాలు మరింత మెరుగవుతాయన్నారు.

నేరాలు ఘోరాలు



నకిలీ ఎస్ఐ వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

నకిలీ ఎస్ఐ గుట్టురట్టు

పోలీసులకు చిక్కిన కేటుగాడు

ప్రజాశక్తి - కొవ్వూరు

పోలీస్ యూనిఫామ్ వేసుకుని నకిలీ ఎస్ఐ అవతారం ఎత్తి హైవేపై వాహనాల నుంచి సొమ్ములు వసూలు చేస్తున్న కేటుగాడిని కొవ్వూరు రూరల్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. రూరల్ ఎస్ఐ కె.శ్రీహర్రావు తెలిపిన వివరాలు ప్రకారం... ధవలేశ్వరంలోని బొమ్మరిల్లు అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న సరెళ్ల సంజయ్‌రాజు అనే వ్యక్తి నకిలీ పోలీస్ అవతారం ఎత్తి మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించామన్నారు. మంగళవారం అర్ధరాత్రి జాతీయ రహదారి సర్వీస్ రోడ్డుపై ఆపి నిద్రిస్తున్న ఐసర్ వ్యాన్ డ్రైవర్‌ను సంజయ్‌రాజు బెదిరించి సొమ్ములు కాజేశాడు. ఆ సమయంలో ఐసర్ వ్యాన్ డ్రైవర్‌కు అనుమానం వచ్చి నకిలీ ఎస్ఐ వచ్చిన బైకు నెంబర్‌ను నోట్ చేసుకున్నాడు. రూరల్ పోలీసులను ఆశ్రయించడంతో కేటుగాడి గుట్టు బయటపడింది. నిందితుడు సంజయ్ రాజును అరెస్టు చేసి కొవ్వూరు కోర్టులో హాజరుపరిచామన్నారు. నిందితునికి రిమాండ్ విధించారని తెలిపారు. రాజమండ్రి వన్ టౌన్, త్రీ టౌన్, రాజానగరం, రావులపాలెం, శ్రీకాకుళం జెఆర్‌పురం పోలీస్ స్టేషన్లల్లో నిందితునిపై కేసులు ఉన్నాయన్నారు. 24 గంటల్లోనే నకిలీ ఎస్ఐను పట్టుకున్న పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మోటార్ సైకిల్ పై వెళుతున్న యువకుడిని వ్యాన్ ఢీకొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన గురువారం చోటు చేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నగర పంచాయతీ పరిధిలోని జాతీయ రహదారి 216 పై రాజుపాలెం సెంటర్ వద్ద మోటార్ సైకిల్ మెకానిక్‌గా పని చేస్తున్న గుబ్బల పవన్ కుమార్ (27) మోటార్ సైకిల్‌పై రాజుపాలెంలోని తన ఇంటికి వెళుతున్నాడు. ఎదురుగా వస్తున్న వ్యాన్ అతివేగంగా వచ్చి ఢీ కొట్టి, పక్కనే ఉన్న అంబేద్కర్ విగ్రహం వరకు ఈడ్చుకుని వెళ్లిపోవడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు ఎస్ఐ డి.జ్వాలా సాగర్ కేసు నమోదు చేసి, మృతదేహాన్ని శవ పంచానామా నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి,దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



అధికారులు స్వాధీనం చేసుకున్న ఎరువుల లారీ

40 టన్నుల యూరియా స్వాధీనం

ప్రజాశక్తి-గొల్లప్రోలు

మండలంలోని తాటిపర్తి, వన్నెపూడిలో యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తుండగా బుధవారం రాత్రి విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ ఐ.గోపాలకృష్ణ, వ్యవసాయ శాఖ, రెవెన్యూ, పోలీస్ అధికారులు దాడులు నిర్వహించారు. తాటిపర్తి పెద్ద చెరువు దగ్గర యూరియాతో ఉన్న రెండు లారీల్లో 40.250 టన్నుల యూరియా బస్తాలను గుర్తించారు. యూరియా బస్తాలను శ్రీనాగదుర్గ పురుగు మందుల షాపు వారు అధిక ధరకు అమ్మకాలు చేస్తున్నట్టు అధికారులు గుర్తించారు. రెండు లారీలను సీజ్ చేశారు. వారిపై 6 ఎ కేసు నమోదు చేసినట్టు సిఐ జి.శ్రీనివాస్ ఎఎస్ఐ లక్ష్మణ స్వామి తెలిపారు. ఈ దాడుల్లో పిఠాపురం వ్యవసాయ శాఖ ఎడి పి.స్వాతి, ఎఒ కెవివి.సత్యనారాయణ పాల్గొన్నారు.

బొబ్బిల్లంకలో చోరీ

ప్రజాశక్తి - సీతానగరం

బొబ్బిల్లంక గ్రామానికి చెందిన లంకే రాంబాబు ఇంట్లో చోరీ జరిగిందని బుధవారం సీతానగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం రాంబాబకు కుటుంబం కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం గ్రామంలో బంధువులు ఇంటికి వెళ్లింది. బుధవారం స్వగ్రామైన సీతానగరం మండలం బొబ్బిల్లంకలో ఇంటికి వచ్చారు. ఇంటి పైకప్పు పెంకులు తొలగించి ఉండటం గమనించారు. లోపలికి వెళ్ళి చూడగా రూ.50వేల నగదు, నాలుగు గ్రాముల బంగారం, వెండి పట్టీలు, వెండి గ్లాసు, వెండి ప్లేటు అపహరణకు గురైయ్యాయని గుర్తించాడు. వెంటనే పోలీసులు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ రామ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కొంతమూరు విద్యార్థుల ఎంపిక

రాజమహేంద్రవరం : రాష్ట్ర స్థాయి అత్య పాత్య పోటీలకు రాజమహేంద్రవరం రూరల్ కొంతమూరు జడ్‌పి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని అత్య పాత్య క్రీడా సంఘం అధ్యక్షులు ప్రశాంత్ కుమార్ తెలిపారు. కొంతమూరు జడ్‌పి పాఠశాలలో గురువారం ఈ ఎంపకలు జరిగాయన్నారు. పాఠశాలకు చెందిన ఐదుగురు బాలికలు, 11 మంది బాలురు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. 25, 26వ తేదీల్లో నకరికల్లులో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం బి.రత్నకళ, పిఇటి టి.సుజాత పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

గోకవరం : గోకవరంలోని రాజా పబ్లిక్ ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులకు లింపాటిక్ ఫైలేరియాసిస్ వైద్య పరీక్షలు గురువారం నిర్వహించారు. కొత్తపల్లి పిహెచ్‌సి వైద్యులు తిరన్, నిఖిత ఆధ్వర్యంలో నిర్వహించారు. 142 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పి.సూర్యప్రకాష్, ఎఎంఒ పి.శ్రీనివాస్, సబ్ యూనిట్ ఆఫీసర్ పి.శ్రీహరి, హెచ్‌వి రాజేశ్వరి, ఎల్‌టి బి.ఝాన్సీలక్ష్మి, ఎంఎల్ హెచ్.పిలు, ఎఎన్‌ఎంలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విధానాల ఖరారు తర్వాతే చర్యలు

ప్రజాశక్తి కథనానికి కలెక్టర్ వివరణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

ఫ్రీహోల్డ్ అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌పై తుది నిర్ణయాలు తీసుకోవడం పూర్తిగా ప్రభుత్వ పరిధిలోకి వస్తుందని, విధానాలు ఖరారు చేసిన తరువాత దానికనుగుణంగా చర్యలు చేపడతామని కలెక్టర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. రైతులకు అసైన్డ్ కష్టాలు' శీర్షికన ప్రజాశక్తి పత్రికలో వచ్చిన కథనంపై కలెక్టర్ వివరణ ఇచ్చారు. తూర్పు గోదావరి జిల్లాలో కేటాయించబడిన రైతులు తమ భూములు ఫ్రీహోల్డ్‌లో ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్లలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పత్రికలో వచ్చిన సమాచారం గమనార్హమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యతతో పరిగణిస్తుందన్నారు. ప్రభుత్వం భూములను ఫ్రీహోల్డ్‌గా మార్చడంపై సమగ్ర దర్యాప్తు జరపాలని, ఏవైనా భూ కబ్జాలకు సంబంధించిన అంశాలను పరిశీలించాలని, మార్పిడుల వాస్తవికత, చట్టబద్ధతను ధృవీకరించాలని ఇప్పటికే ఆదేశించినట్లు కలెక్టర్ తెలిపారు. అంతేకాకుండా, మూడవ పక్ష ఆసక్తి సృష్టించకుండా నిరోధించేందుకు పత్రాల పరిశీలన కొనసాగుతోందన్నారు. ఈ ప్రక్రియను పూర్తి చేయడానికి ప్రభుత్వం ఈ ఏడాది నవంబర్ 9వరకూ గడువు పొడిగించిందని తెలిపారు. ఈ ఏడాది మార్చి 5న ప్రభుత్వం జారీ చేసిన జిఒ 464 ప్రకారం, ఫ్రీహోల్డ్ భూముల జిస్ట్రేషన్‌పై విధానాన్ని ఖరారు చేయడానికి, బలహీన వర్గాల ప్రయోజనాలు పరిరక్షించబడేలా చూడడానికి, ప్రజల డిమాండ్ల మధ్య సమతుల్యత సాధించడానికి మంత్రుల బృందాన్ని నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. అందువల్ల, ఫ్రీహోల్డ్ అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌పై తుది నిర్ణయాలు తీసుకోవడం పూర్తిగా ప్రభుత్వ పరిధిలోనికి వస్తుందన్నారు. విధానం ఖరారు చేయబడిన తర్వాత అనుగుణ చర్యలు చేపడతామని కలెక్టర్ స్పష్టం చేశారు.

జిల్లాలో యూరియా కొరత లేదు

కలెక్టర్ కీర్తి చేకూరి

ప్రజాశక్తి -కొవ్వూరు

జిల్లాలో యూరియా కొరత లేదని, అవసరం మేరకు నిల్వలు ఉన్నాయని, రైతులు ఆందోళన చెందనవసరం లేదని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. మండలంలోని దొమ్మేరు పిఎసిఎస్‌ను ఆమె గురువారం సందర్శించారు. రైతులతో యూరియా సమస్యపై మాట్లాడారు. యూరియా సమయానికి అందుబాటులోకి వచ్చేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. వివిధ పంటల్లో యూరియా వాడకం, దిగుబడులపై ఆరా తీశారు. అధిక మోతాదులో యూరియా వాడటం వల్ల కలిగే నష్టాలను రైతులకు వివరించారు. శాస్త్రీయ పద్ధతుల్లో, సిఫార్సు చేసిన మోతాదులోనే యూరియాను వినియోగించాలని సూచించారు. ఆమె వెంట ఆర్‌డిఒ రాణి సుస్మిత, సొసైటీ అధ్యక్షులు గారపాటి రామకృష్ణ, వ్యవసాయ సహాయ సంచాలకులు సిహెచ్.శ్రీనివాస్, ఎఒ ఎ.గంగాధర్, తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ ఉన్నారు.

మహిళల ఆరోగ్యంతోనే సమాజం అభివృద్ధి

ప్రజాశక్తి - యంత్రాంగం

మహిళల ఆరోగ్యంతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని పలువురు వక్తలు అన్నారు. జిల్లాలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం జిల్లాలో రెండో రోజు సాగింది. ఈ సందర్భంగా పలుచోట్ల వైద్య శిబిరాలను నిర్వహించారు. మహిళలకు వైద్య పరీక్షలు చేశారు. ఆరోగ్యంపై అవగాహన కల్పించారు.



కడియంలో పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఉండ్రాజవరం : స్వస్థ్ నారి -సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం గురువారం మండలంలోని వేలివెన్ను పిహెచ్‌సి పరిధిలో వేలివెన్ను హెచ్‌డబ్ల్యుసి-2లో, ఉండ్రాజవరం పిహెచ్‌సి పరిధిలోని కె.సావరం గ్రామాల్లో నిర్వహించారు. మహిళలకు వైద్య పరీక్షలకు నిర్వహించారు. ఆరోగ్యం పట్ల తీసుకోవా ల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కె.సావరం సర్పంచ్ నార్ని రామకృష్ణ, వైద్యాధికారులు డాక్టర్ ఇర్ఫాన్, బి దుర్గా మహేశ్వరరావు, ఆర్.ఉషాదేవి, మాహిళా పర్య వేక్షకురాలు కె.సుభాషిణి, ఎంఎల్‌హెచ్‌పిలు ప్రత్యూష, సాయి, అనూష, బ్యూలాజాయ్, ఎఎన్‌ఎంలు భవాని, సునీత, భాగ్యలక్ష్మి, ఆశాలు పాల్గొన్నారు.

బిక్కవోలు : కొంకుదురు పిహెచ్‌సిలో వైద్య శిబిరాన్ని ఎంపిపి తేతల సుమ ప్రారంభించారు. ఆరోగ్యవంతమైన మహిళలు శక్తివంతమైన కుటుంబం అనే నినాదంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. డాక్టర్ విజయలక్ష్మి మహిళల ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గణేష్ పట్నాయక్, సర్పంచ్ సత్తి వీరమణి, కొవ్వూరు వేణుగోపాల్ రెడ్డి, చింత శ్రీనివాస్ రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


సీతానగరం : చినకొండేపూడి అంగన్‌వాడీ కేంద్రంలో స్వస్థ్ నారీ-సశక్త్ పరివార్ అభియాన్‌ను పి.హెచ్.సి డాక్టర్ చైతన్య ఆధ్వర్యంలో నిర్వహించారు. వైద్యశిబిరాన్ని నిర్వహించి మహిళలకు వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యులు, సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పెరవలి : మండలంలో కానూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ కె.హేమరాజు, పి.తేజశ్రీ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కార్చెర్ల సీతారాంప్రసాద్, సర్పంచ్ భావన మధుపూర్ణచంద్, నడిపల్లి సర్పంచ్ బీర సత్యవేణి, సొసైటీ ప్రెసిడెంట్ వాకలపూడి వీర్రాజు, లయన్స్‌న క్లబ్ మాజీ అధ్యక్షుడు కోలా సీతయ్య నాయుడు, నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కడియం : కేంద్ర ప్రభుత్వం మహిళల ఆరోగ్య సంరక్షణ కొరకు ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని మహిళలంతా సద్వినియోగపరుచుకోవాలని వైద్యాధికారులు డాక్టర్ ఎస్.జెస్సీ సుప్రియ,డాక్టర్ ఎం.మణిజ్యోత్స్న అన్నారు. గురువారం కడియంలో సర్పంచ్ మోసిగంటి సత్యవతి, దుళ్ల లో సర్పంచ్ కొండపల్లి పట్టియ్య పర్యవేక్షణలో వైద్యశిబిరాలు నిర్వహించారు. కడియంలో 146 మందికి, దుళ్లలో 107 మందికి వైద్య సేవలు అందించారు. అనంతరం పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఈ శిబిరాల్లో వైద్య సిబ్బంది,ఆశాలు పాల్గొన్నారు.



ఉండ్రాజవరంలో...



బిక్కవోలులో...

విద్యుత్ ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం



నిరసన తెలుపుతున్న విద్యుత్ కార్మికులు

డిమాండ్లను నెరవేర్చాలని, సమస్యలను పరిష్కరించాలని గోదారి గట్టున గల ఎపిఇపిడిసిఎల్ కార్యాలయం ఎదుట విద్యుత్ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి గురువారం భోజన విరామ సమయంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. విద్యుత్ ఉద్యోగులకు పెన్షనర్లకు వారి కుటుంబ సభ్యులకు పూర్తి వైద్య ఖర్చుల చెల్లించాలన్నారు. జిపిఎఫ్‌తో కూడిన పింఛను నిబంధనలను 1999 ఫిబ్రవరి 1 నుంచి 2024 ఆగష్టు 31 వరకూ నిమితులైన ఉద్యోగులందరికీ వర్తింపజేయాలన్నారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలన్నారు. ఆగస్టు 2023లో విద్యుత్ సంఘాలతో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం ప్రకారం యాజమాన్యమే నేరుగా వేతనాలు చెల్లించాలన్నారు. ఎరియర్స్ చెల్లించాలని, పదేళ్ల సర్వీసు దాటిన వారందరికీ 2018 రివిజన్‌లో మంజూరు చేసిన 'సర్వీస్ ఇన్సెంటివ్'ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. కారుణ్య నియామకాలు చేపట్టాలన్నారు. 2019లో నియమించిన ఎనర్జీ అసిస్టెంట్లను రెగ్యులర్ జెఎల్‌ఎంలుగా పరిగణించాలన్నారు. పెండింగ్ డిఎలు, డిఆర్‌లను మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమం జిల్లా జెఎసి చైర్మన్ పి.రామారెడ్డి, డివిజన్ చైర్మన్ ఎం.శ్రీనివాసు, డివిజన్ కన్వీనర్ కె.శ్రీనివాసు ఆధ్వర్యంలో జరిగింది.

సీతానగరంలో ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ గురువారం ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టిబాబు మాట్లాడారు. కళాశాలలో అందుబాటులో ఉన్న ఎకెసి ల్యాబ్‌లు, కంప్యూటర్ల వినియోగం, విలువైన పుస్తకాలతో కూడిన లైబ్రరీ, క్రీడాస్థలం, ఇంటర్నెట్ సౌకర్యాలు వంటి వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నిపుణులైన అధ్యాపకుల పర్యవేక్షణలో విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ నాగేశ్వరరావు, సుబ్బారావు, షేక్ దుర్గామదీనా, మీనాక్షి, వాణి, అలేఖ్య, ఫణీంద్ర కుమార్, వెంకటేష్, దుర్గాప్రసాద్, వెంకట రమణయ్య, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సెటిల్‌మెంట్లు చేస్తే కఠిన చర్యలు

డిఎస్‌పి జి.దేవకుమార్

ప్రజాశక్తి - గోపాలపురం



రికార్డులు పరిశీలిస్తున్న డిఎస్‌పి దేవకుమార్

లా అండ్ ఆర్డర్‌ను ధిక్కరించి సెటిల్‌మెంట్లు చేసినా, అల్లర్లకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని కొవ్వూరు డిఎస్‌పి జి.దేవకుమార్ హెచ్చరించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం గోపాలపురం పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు. పలు కేసులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఇటీవల గోపాలపురంలో జరిగిన అల్లర్ల విషయంలో పలువురుపై కేసులు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు. మత్తు పదార్థాల విక్రయం, వాడకంపై చర్యలు తప్పవన్నారు. గంజాయి అమ్మినా, తరలించిన పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు సూచించారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. సిబ్బందితో సమావేశమై వారికి పలు సూచనలు చేశారు. ఇటీవల జరిగిన వినాయక చవితి ఉత్సవాల్లో గోపాలపురం మండలంలో ఎలాంటి సంఘటనలు జరగకుండా సమర్థవంతంగా నిర్వహించినందుకు ఎస్ఐ మనోహర్‌ను ప్రశంసించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్లకు వచ్చే ప్రజలు, ఫిర్యాదుదారుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలన్నారు. నేరస్తుల పట్ల మాత్రం కఠినంగా వ్యవహరించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట దేవరపల్లి సిఐ నాగేశ్వర్‌నాయక్, ఎస్ఐ, సిబ్బంది ఉన్నారు.

ఉపాధ్యాయులకు యుటిఎఫ్ సన్మానం

ప్రజాశక్తి-గోకవరం



గోకవరం మండల యుటిఎఫ్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్న డివిపిఆర్ఎయూపి పాఠశాల హెచ్‌ఎం యాళ్ల అబ్రహాంపాల్, ఈ విద్యా సంవత్సరంలో రిటైర్డ్ అయిన ఉపాధ్యాయులు ఎంఎస్.రత్నరాజు, జి.రాంబాబు, డి.సుబ్రహ్మణ్యం, జెస్సీ, ఆయా సంస్థల ద్వారా ఉపాధ్యాయ అవార్డులు పొందిన ఎం.సుధాలక్ష్మి, సిహెచ్‌వి.కృష్ణంరాజు, ఎన్.వెంకటేశ్వరరావు, పెదిరెడ్ల రాజులను గురువారం ఘనంగా సత్కరించారు. స్థానిక సూర్య కళ్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు పిఎస్‌వివిఎస్ఎస్.సాయిబాబా మాటాడారు. విద్య తోనే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సుంకర వీరబాబు, దాసరి తమ్మన్న దొర, గాజింగం సత్తిబాబు, పులపర్తి బుజ్జి, యుటిఎఫ్ నాయకులు కె.నాగభూషణం, ఆర్.హరనాథ్, పంతం త్రిమూర్తులు, సాయిబాబా, ఎం.ప్రేమకుమార్, ఎస్.కుమార్ తదితరులు పాల్గొన్నారు.

20న తాగునీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ప్రధాన మంచినీటి సరఫరా విభాగంలో 600ఎంఎం పిఎస్‌సి పైపులైన్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 20న తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వాటర్ సప్లయ్ అసిస్టెంట్ ఇంజినీర్ తెలిపారు. 1, 2, 3, 4, (9, 10, 11, 12) పార్ట్, 36 పార్ట్, 37, 42 పార్ట్, 43, 44, 48 పార్ట్, 50 డివిజన్లలో నీటి సరఫరా తాత్కాలికంగా నిలిపేస్తామన్నారు. రాజేంద్రనగర్, సుబ్బారావుపేట, నెహ్రూనగర్, తదితర ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదన్నారు. 21న యథావిధిగా సరఫరా ఉంటుందన్నారు. ఆయా ప్రాంతాలకు వాటర్ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తామన్నారు. ప్రజలు గమనించి సహకరించాలన్నారు. వాటర్ ట్యాంకర్ల కోసం 9849908350 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

కిడ్నీ వ్యాధి బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - గోపాలపురం

కిడ్నీ సంబంధిత అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న భీమోలు గ్రామానికి చెందిన బెజవాడ రమేష్‌కు మానవత సంస్థ రూ.6వేల ఆర్థిక సాయం అందించింది. మానవత సంస్థ ఆధ్వర్యంలో దాతలు చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు, ముప్పిడి నాగమణి, వ్యాయామ ఉపాధ్యాయులు, అధ్యక్షులు ఫణి కిషోర్, జిల్లా రక్త నిధి డైరెక్టర్ జోడాల వెంకట్ సౌజన్యంతో ఈ సాయం అందించారు.ఈ సందర్భంగా మానవత ప్రతినిధులకు బాధితుని కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.